www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 26 డిసెంబర్ 2025
5
అన్నమయ్య



హార్సిలీహిల్స్‌లో న్యూఇయర్ వేడుకలపై ఆంక్షలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో నూతన సంవత్సర వేడుకలపై పోలీసు శాఖ ఆంక్షలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు మదనపల్లె డిఎస్‌పి మహేంద్ర పేర్కొన్నారు. గురువారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు హార్సిలీహిల్స్‌లో న్యూ ఇయర్ వేడుకలపైన పలు ఆంక్షలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. డిసెంబర్ 31వ తేదీ ఉదయం నుంచి జనవరి ఒకటవ తేదీ రాత్రి వరకు హార్సిలీహిల్స్‌లో ద్విచక్రవాహనాలతో పాటు ఆటోల రాక పోకలపై నిషేధం కొనసాగుతుందని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం నిషేధమన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల మద్యం బాటిళ్లతో పట్టుపడితే కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలతో పరివేక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు హార్సిలీహిల్స్‌లో బి.కొత్తకోట సిఐ గోపాల్‌రెడ్డి, ముదివేడు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇ-నారీ.. భేరీ



- ఉభయ జిల్లాల్లో రాజకీయ ఎంపికలు?!
- అన్నమయ్యలో 700, కడపలో 600?
- కొత్త ఏడాది నుంచి కార్యకలాపాలు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

డ్వాక్రా సంఘాలను మరింత పరిపుష్టం చేయాలనే ఉద్దేశంతో ఇ-నారీ పేరిట సభ్యుల ఎంపిక చేపట్టింది. కడప, అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా సుమారు 1,300 మంది డ్వాక్రా సంఘాల్లోని చురుకైన సభ్యులను ఎంపిక చేయడంపై రాజకీయ జోక్యం పెరిగింది. ఈ నెల 25 నుంచి 30వ తేదీ నాటికి ఇ-నారీ సభ్యుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసే దిశగా గ్రామీణాభివృద్ధిశాఖ వేగంగా కదులుతోంది. 2026 జనవరి ఒకటి నుంచి ఇ-నారీ సభ్యుల విధులకు సంబంధించిన అంశాలపై శిక్షణ కార్యకలాపాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది.

ఉభయ జిల్లాలో డ్వాక్రా సంఘాల ఆధునీకరణ ఊపందుకుంది. కడప జిల్లాలోని 26,423 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈలెక్కన కడప జిల్లాలో 600 మంది, అన్నమయ్య జిల్లాలోని 29 వేల స్వయసహాయక సంఘాలకుగానూ 700 మందిని కలిపితే 1,300 మంది వరకు నియమితులయ్యే అవకాశాలు ఉన్నాయి. వీరిని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోని స్త్రీనిధి, పరపతి సమాఖ్య, ఇతర ఆర్థిక వ్యవహారాలు మొదలుకుని మనడబ్బులు-మన లెక్కల యాప్ ద్వారా డ్వాక్రా సంఘాల రుణాల చెల్లింపులు, దుర్వినియోగాన్ని అరికట్టడం, జీవనోపాధుల కార్యక్రమాలను పెంపొందించడం, ప్రభుత్వ సర్వేలు తదితర అంశాల్లో ఇ-నారీ మహిళలను ఉపయోగించుకోనుంది. ప్రతి ఇ-నారీ ఎంపికలో టెన్త్ నుంచి డిగ్రీ అర్హత, 18 నుంచి 45 ఏళ్ల కలిగిన డ్వాక్రా సంఘాల్లోని సభ్యులను ఎంపిక చేయనున్నారు. ప్రతి 25 డ్వాక్రా సంఘాలకు ఇద్దరు చొప్పున ఇ-నారీ సభ్యులు, ఆపై పెరిగితే ప్రతి 10 మంది మందికి ఒకరు చొప్పున సిఆర్‌పిల ఎంపిక ఊపం దుకుంది.

రోజుకు రూ.300 పారితోషికం

ఇ-నారీ, సిఆర్‌పిఎఫ్ సభ్యులకు రోజుకు రూ.300 చొప్పున పారితోషికం చెల్లించనున్నారు. నెల రోజుల వ్యవధిలో 15 రోజులకు రెండు నుంచి మూడు రోజులు మాత్రమే విధులు నిర్వహించే అవకాశం ఉంది. ఈలెక్కన నెలకు కనిష్టంగా నాలుగు నుంచి గరిష్టంగా ఎనిమిది రోజులకు రూ.2,400 మాత్రమే పారితోషికం లభించనుంది. మనబడి-మన లెక్కల పేరిట రూపొందించిన యాప్ ద్వారా ఆధార్ ఎంటర్ చేయడం ద్వారా డ్వాక్రా రుణాల వినియోగం, జీవనోపాధుల కల్పన, ప్రభుత్వ సర్వేల విధులను నిర్వహించాల్సి ఉంటుంది.

ఇ-నారీ ఎంపికల్లోనూ రాజకీయమే

ఇ-నారీ, సిఆర్‌పిఎఫ్ ఎంపికలో రాజకీయ జోక్యం పెరిగిందనే వాదన వినిపిస్తోంది. కడప జిల్లాలో ఏడు, అన్నమయ్య జిల్లాలో ఆరు అసెంబ్లీలు ఉన్నాయి. ఈలెక్కన 13 నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ ఇన్‌ఛార్జులు ఎంపికల్లో కీలక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

జనవరి నుంచే...

2026 జనవరి నాటికి ఇ-నారీ ఎంపికల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. అనంతరం ఉభయ జిల్లా కేంద్రాల్లో ఎంపికైన ఇ-నారీ, సిఆర్‌పిఎఫ్‌లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనుంచి. అనంతరం ఇ-నారీ, సిఆర్‌పిఎఫ్‌లకు విధులు అప్పగించనుంది.

జీ రామ్ జీ బిల్లును రద్దు చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడతున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేసి మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్‌జిఒ హోంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీ, ప్రజా సంఘాల నాయకులు సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి ఎం.విశ్వనాథ్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని పేద వ్యవసాయ కూలీలకు దూరం చేసి కార్పొరేట్ల కు కట్టబెట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టం వల్ల కుల మతాలకు అతీతంగా స్త్రీ, పురుషులకు కూలి రేట్లు సమంగా ఇస్తూ ఆర్థిక అసమానతలు లేకుండా ఉందని చెప్పారు. వలసలు తగ్గాయని, నిరుద్యోగం తగ్గుముఖం పట్టిందని తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి నిలకడగా ఉంటుందన్నారు. భూస్వాములకు ఇది నచ్చక రద్దు చేయాలంటున్నారని పేర్కొన్నారు. కేంద్రం రాష్ట్రాల నుంచి పన్నులు వసూళ్ళలో అధిక శాతం తీసుకుంటూ మరో వైపు భారాలు కూడా అధిక శాతం వేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్ట నిర్వహణకు రాష్ట్రాలు 40 శాతం భరించాలని చట్ట సవరణ చేస్తే రాష్ట్రం లోని పాలక ప్రతి పక్షాలు నోరు మెదపకపోవడం పేదల కడుపుకొట్టడం కాదా అన్నారు. విబి జిఆర్ఎంజిని వెంటనే ఉపసం హరించుకోవాలన్నారు. గ్రామీణ ప్రజనీకాన్ని ఉద్యమం వైపు నడిపి చట్టాన్ని కాపాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాధవయ్య, రత్నం సిద్దిమల్లు, వ్య.కాస నాయకులు వీరభద్ర, ఎఐఎస్ఎఫ్ నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో మాజీ సిఎం జగన్



సిఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మాజీ సిఎం జగన్, విజయమ్మ

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. గురువారం క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో ఉదయం 8.45 గంటల నుండి 11 గంటల వరకు తల్లి వైఎస్.విజయలక్ష్మి, సతీమణి వైఎస్.భారతి, కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థ నలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి రాష్ట్ర ప్రజలకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిఎస్ఐ చర్చి రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను జగన్ ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్య పథం వైపు నడవాలన్నారు. చర్చిలో తన వద్దకు వచ్చిన చిన్నారులను మహిళలను అప్యాయంగా పలకరించారు. జగన్ మోహన్ రెడ్డిని కలిసేందుకు జిల్లా చుట్టూ పక్కల నుంచి అబిమానులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చర్చి ప్రాంగణం అంత జన సందోహంలో నిండి పోయింది. అందరిని అప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాయచోటి, కడప, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, అంజాద్‌బాషా, కోరుముట్ల శ్రీనివాసులు, వైఎస్ కుటుంబ సభ్యులు వైఎస్.ప్రకాష్‌రెడ్డి, వైఎస్.మనోహర్‌రెడ్డి, వైఎస్.మదన్ మోహన్‌రెడ్డి, వైఎస్.ప్రతాపరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, ప్రజాప్రతినిధులు, చర్చి పాస్టర్స్ పాల్గొన్నారు. కాగా క్రిస్మస్ వేడుకలు ముగిసిన వెంటనే హెలికాప్టర్‌లో జగన్ బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.



జగన్‌కు కేక్ తినిపిస్తున్న తల్లి విజయమ్మ

వైద్యుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విధి నిర్వహణ సమయంలో తమ విధులకు డుమ్మా కొట్టి, రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు (సిపిఎం, సిపిఐ) గురువారం ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి మహేష్ లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీనర్ రామచంద్ర అస్వస్థతకు గురి కావడంతో మధ్యాహ్నం 12:40 గంటలకు రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా డ్యూటీ డాక్టర్ లేరని తెలిపారు. అక్కడ డ్యూటీలో ఉన్న నర్సు బీపీ షుగర్ టెస్టులు నిర్వహించారని, . అనంతరం రెండు గంటలు సమయమైన డ్యూటీ డాక్టర్ విధులకు హాజరు కాకపోవడం చూస్తుంటే ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నార అన్నది అర్థమవుతుందని తెలిపారు. కుక్కల దాడిలో గాయపడిన ఓ వ్యక్తి అదే సమయంలో అక్కడికి వచ్చి, డాక్టర్ అందుబాటులో లేని కారణంగా తనే కట్టు కట్టుకుని వెళ్లిన దౌర్భాగ్యపు పరిస్థితి నెలకొని ఉందని తెలిపారు. రాష్ట్ర మంత్రి, కలెక్టర్‌చ జిల్లా వైద్యశాఖ అధికారులు రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని వైద్యుల నిర్లక్ష్యంపై తక్షణం చర్యలు తీసుకుని, ప్రభుత్వ ఉచిత వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, నాయకులు రామచంద్ర, సుధీర్, మాధవ్ సిపిఐ నియోజకవర్గా కార్యదర్శి సిద్దిగాల శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి పాల్గొన్నారు.

చంద్రన్న బీమాకు గ్రహణం

- 18 నెలలు అవుతున్నా అమలు కానీ పథకం
- రేషన్ కార్డు లబ్ధిదారులకు వర్తించని బీమా
- కుటుంబ పెద్దను కోల్పోతే పరిహారం శూన్యం
- బీమాపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం





ప్రజాశక్తి-పులివెందుల టౌన్

చంద్రన్న బీమాకు గ్రహణం ఏర్పడింది.. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్నా అమలు కానీ పరిస్థితి. బీమాపై ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి స్వష్ఠత లేదు. ప్రమాదాలు, సహజమరణాల్లో కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన పేదలకు అండగా ఉండే బీమా పథకం అమలుపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా బీమా పథకం అమలుపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. రేషన్ కార్డు ఉన్న కుటుంబ పెద్ద ఆకస్మిక, సహజ మరణం పొందినపుడు ఆ కుటుంబానికి ఆర్థిక ఉపశమనం కలిగించడం కోసం ప్రభుత్వం బీమా పథకం ప్రవేశపెట్టింది. 2014-19 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం అమలు చేసింది. అనంతరం వైసిపి ప్రభుత్వంలో వైఎస్ఆర్ బీమా అనే పేరుతో ఈ పథకం అమలు చేసింది.

అమలు ఇలా...

కుటుంబ పెద్ద సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.5 లక్షలు, శాశ్వత వికలాంగులుగా మారితే రూ.5 లక్షలు, 70 ఏళ్ల వ్యక్తి ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.3లక్షలు అందించే విధంగా పథకం రూపకల్పన చేసింది. జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) ఆధ్వర్యంలో బీమా పథకం అమలు చేసేవారు. ఇందుకోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూంతోపాటు 24 గంటలూ పనిచేసే విధంగా ఆధికారులను కేటాయించారు. ఫోన్ ద్వారా సమాచారం అందిన వెంటనే వివరాలు నమోదు చేసుకుని, దగ్గరలోని ఎపిఎంలకు, యానిమేటర్లకు విషయం తెలిపి సకాలంలో బీమా మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేసేలా చర్యలు తీసుకునేవారు. కూటిమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రన్న బీమా పథకం అమలు చేస్తామని ప్రజాగళం ఉమ్మడి మేనిఫెస్టోలో ఆ పార్టీల నాయకులు హామీచ్చారు. గతం కన్నా మిన్నగా ఆర్థికప్రయోజనం చేకూరుస్తామని గొప్పలు చెప్పారు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తామని ప్రకటనలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర పూర్తవుతున్నా ఇంతవరకూ చంద్రన్న బీమా పథకం గురించి పార్టీ నాయకులెవరూ మాట్లాడని పరిస్థితి నెలకొంది. పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. ఇలాంటి వారికి బీమా అమలు చేసి ఉంటే కాసింత ఉపశమనం కలిగేదని బాధిత కుటుంబాలు పేర్కొంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ఆర్ బీమా పథకం అమలకు నోచుకోలేదు. అప్పట్లో ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన వారికి ఎలాంటి బీమా అందించలేదు. అడపాదడపా నూటికి ఒకరికో ఇద్దరికి బీమా సొమ్మును అందించి చేతులు దులుపుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

రేషన్ కార్డు లబ్దిదారులకు వర్తించని బీమా..

ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని గాలి కొదిలేసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న బీమా పథకం అమలులో తాత్సారం చేస్తోంది. జిల్లాలో రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలు 5,73,675 లక్షలు ఉన్నాయి. రెవెన్యూ డివిజన్ల వారీగా చూస్తే పులివెందుల 90,779, కడప 1,75,438, జమ్మలమడుగు 1,92309, బద్వేల్ 1,15,148 కలిపి మొత్తం 5,73,675 రేషన్ కార్డులు ఉన్నాయి. గతేడాది (2024-25)లో వివిధ ప్రమాదాల్లో 400 మంది దాకా చనిపోయారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటి వరకు 350 మంది దాకా మరణించారు. ఏటా 950 నుంచి 1100 సహజ మరణాలు నమోదవుతున్నాయి. వందలాది మంది ప్రమాదాల కారణంగా వైకల్యం బారినపడి మంచానపడ్డారు. బీమా పథకం లేకపోవడంతో ఆయా బాధిత కుటుంబాలు రోడ్డునపడ్డాయి. బీమా విషయం పై ప్రభుత్వం తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రభుత్వం స్పందించి బీమా పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

బీమా పథకం అమలుచేయాలి

కూటమి నాయకులు ఎన్నికల హామీలో భాగమైన చంద్రన్న బీమా పథకం తక్షణమే అమలు చేయాలి. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం ఎంతో ఉపయోగకరం. ప్రమాదాలు సహజ మరణాల్లో కుటుంబాన్ని పోషించే పెద్ద మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో కొట్టు మిట్టాడుతుంది బీమా సొమ్ము ఆ కుటుంబానికి భరోసా ఇస్తుంది. కూటమి ప్రభుత్వ నాయకులు బీమా పథకం అమలు చేసేందుకు చొరవ చూపాలి.

- మనోహర్ , సిఐటియు నాయకులు



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి

చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి కనబర్చాలి

ప్రజాశక్తి-రాయచోటి: యువత చదువుతో పాటు క్రీడల్లో విశేషంగా రాణిస్తూ ప్రతి ఒక్కరూ కూడా క్రీడా స్ఫూర్తితో మెలగాలని టిడిపి నియోజక వర్గ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాల హెలిప్యాడ్ మైదానంలో టిడిపి నాయకులు మడితాటి శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆర్‌పిఎల్ లీగ్ క్రికెట్‌టోర్నమెంట్‌ను ప్రారంభించారు. సందర్భంగా లక్ష్మి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ టోర్నమెంట్‌కు మొదటి బహుమతిగా శ్రీనివాసరెడ్డి రూ. లక్ష, రెండవ బహుమతిగా ఖాదరవల్లి రూ.50 వేలు ప్రకటించి యువత ను ప్రోత్స హించడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లు గురించి ఆర్గనైజర్‌ని అడిగి తెలుసుకున్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో త్వరలో ఇండోర్ స్టేడియం ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ కొండాభాస్కర్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు యనమల మదన్‌మోహన్, పోలిరెడ్డి సుబ్బారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రాయుడు కాలనీ రంజిత్ రాయల్, మూడవ వార్డు టిడిపి నాయకులు ఖాదర్‌వలి, రామాపురం టిడిపి నాయకులు చెన్నకృష్ణ, మహమ్మద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

రాజకీయ కుట్రలో భాగమే డికె అరెస్టు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న కీ.శే.డి.కె.ఆదికేశవలు నాయుడు కుటుంబాన్ని రాజకీయంగా సమాధి చేసేందుకే కుట్రలో భాగంగా డి.కె.శ్రీనివాస్, డి.కె.కల్పజ, హ్యూమన్ రైట్స్ డిఎస్‌పి మోహన్‌ను అరెస్టు చేశారని పారిశ్రామికవేత్త అమరానాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పట్టణంలో దేవతనగంర్‌లో తన స్వగృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డి.కె.ఆదికేశవులు నాయుడు అంటే తెలియని వారు లేరన్నారు. టిటిడి పాలకమండలి చైర్మన్‌గా పనిచేసిన డి.కె. ఆది కేశవలు నాయుడు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన కుమారుడు డి.కె. శ్రీనివాస్, కుమార్తె కల్పజ బెంగళూరులో స్థిర నివాసం ఉంటున్నారని, గత ఆరేళ్ల కిందట వీరి వద్ద డ్రైవర్ పనిచేస్తున్న రఘునాథ్ వారి ఇంటిలోనే చనిపోతే ఇన్నాళ్ల తర్వాత ఆ మరణాన్ని డి.కె. శ్రీనివాస్, కల్పజకు అంటగట్టి రాజకీయ కుట్ర చేశారని ఆరోపించారు. వీరితో పాటు అప్పట్లో ఉన్న హ్యూమన్ రైట్స్ డిఎస్‌పి మోహన్ సైతం సిబిఐ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. డికె ఫ్యామిలీకి ఉన్న ఆస్తులను కాజేయడానికి కుట్రలు పన్నుతున్నారని, నిజం నిర్భయంగా తెలుస్తుందని చెప్పారు. డి.కె. శ్రీనివాస్ కల్పజ లు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. వారితో 30 ఏళ్లుగా ఉన్న డ్రైవర్‌ను చంపాల్సిన అవసరం వారికి లేదని, అతని ఇంట్లోనే స్వతహాగా చనిపోయాడని పోలీసులు, కోర్టు నిర్ధారించినా తిరిగి వారిపై విషం కక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి నిర్దోషులైన డి.కె.శ్రీనివాస్, కల్పజ, మోహన్‌ను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో రాయల్ గణి, గట్టు చంద్రశేఖర్, గల్లా భాస్కర్, నసీబ్, నరేష్ నాయుడు, సతీష్ కుమార్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ ప్రసాద్ బాబు

గంజాయి ముఠా అరెస్టు

- 10 కిలోల గంజాయి స్వాధీనం : సిఐ

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట రూరల్ పోలీసులు పెద్ద ఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయించే ఏడుగురు యువకులను కొత్త బోయినపల్లిలో అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం రూరల్ సిఐ ప్రసాద్‌బాబు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బీహార్ యువకులు ఇతర రాష్ట్రాల నుండి పెద్ద మొత్తంలో గంజాయిని తీసుకు వచ్చి తిరుపతి జిల్లా వనమాలపేటలో డాబా నడుపుతూ గంజాయి విక్రయం చేసేవారని తెలిపారు. వాహనదారులు, డ్రైవర్లును ఎలక్షన్‌గా చేసుకొని గంజాయి విక్రయించేవారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాజంపేట పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయం చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. వారి వద్ద నుంచి 10 కిలోల గంజాయి, 6 సెల్ ఫోన్లు, రూ.3 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న యువకులను కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు.

నిరాదరణకు గురైన వృద్ధులను ఆదుకుందాం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

నిరాదరణకు గురైన వృద్ధులను మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీ శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు శ్రీనివాసులు అన్నారు. గురువారం మర్రిపాడు రోడ్డులో ట్రస్టు ఆధ్వర్యంలో నూతనంగా వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ట్రస్టు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి చేతులమీదుగా పిల్లలకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రమేష్ బాబు, టిడిపి నాయకులు కోసూరి రమేష్, కెకె, తదితరులు పాల్గొన్నారు.



నిరుపేద పిల్లలకు విద్యా సామగ్రిని అందించిన ట్రస్టు సభ్యులు

రైతు భవన్ ఏర్పాటు చేస్తాం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఎసియాలోనే అతిపెద్ద టమోటా మార్కెట్‌గా పేరుగాంచిన మదనపల్లె మార్కెట్ యార్డ్‌లో రైతు భవన్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాష స్పష్టం చేశారు. గురువారం ఎమ్మెల్యే మదనపల్లె టమోటా మార్కెట్ యార్డును ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి రైతులు, వ్యాపారులు, మండీ నిర్వాహకులతో కలిసి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసియాలోనే అతి పెద్ద మార్కెట్‌గా గుర్తింపు పొందిన మదనపల్లె టమోట మార్కెట్ యార్డులో రైతు భవన్ నిర్మించి, రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతు తాను పండించిన పంటకు డబ్బులు తీసుకునేవరకు రైతు భవన్‌లోనే బస చేసే ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్ యార్డులో విశ్రాంతి గదులు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యాపారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇండియన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఆదినారాయణరెడ్డి

'పది' మార్కులే విద్యార్థి స్థాయిని నిర్దేశిస్తాయి

ప్రజాశక్తి-కలికిరి

పదవ తరగతి మార్కులే విద్యార్థి స్థాయిని నిర్దేశిస్తాయని ఇండియన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఆదినారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆదీశ్ ఇండియన్ పబ్లిక్ స్కూల్లో జరిగిన పదవ తరగతి విద్యార్థుల సమావేశంలో పాఠశాల ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రాథమిక, ఉన్నత విద్యా స్థాయి పదవ తరగతిలోనే పరీక్షిస్తారని వారు సాధించిన మార్పులే విద్యార్థుల విద్యా స్థాయిని నిర్దేశిస్తాయని పేర్కొన్నారు. పిల్లల్లో ప్రతిభా ప్రగతిని కాంక్షించే తల్లిదండ్రులు పాటించవలసిన నియమాలను జాగ్రత్తలను సూచించారు. ప్రధానోపాధ్యాయులు షాహినా మాట్లాడుతూ క్రమశిక్షణతో ఏకాగ్రతతో పట్టుదలగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. నాగజ్యోతి అమీర్ అనూష సబిహా ఫరహా, శివకుమార్ తల్లిదండ్రులకు విద్యార్థులకు అనేక సలహాలు సూచనలు తెలియజేశారు. తల్లిదండ్రుల సందేహాలను సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు నివృత్తి చేశారు. 100 శాతం ఫలితాలను సాధించేందుకు విద్యార్థులకు అనేక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని వైసిపి మండల వైస్ ప్రెసిడెంట్ వేంపల్లి బావాజీ, వార్డు మెంబర్ సయ్యద్ కలిసినట్లు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి మండలంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించారన్నారు. పార్టీ పరిస్థితిపై ఆయనతో చర్చించినట్లు తెలిపారు. మీ సందర్భంగా మిథున్‌రెడ్డి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉండాలని సూచించినట్లు తెలిపారు.


శ్రీసౌమ్యనాథ స్వామి సన్నిధిలో అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి

సౌమ్యనాథుని సన్నిధిలో ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి - నందలూరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామిని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కడప జిల్లా అన్నమయ్య అథారిటీ అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ ముక్కారూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి గురువారం దర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను పూజారి వివరించడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు ఎద్దుల విజయసాగర్ వారిని పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మోడపోతుల రాము, చక్రాల సాయినాథ్, వంశీ, కొట్టే శ్రీహరి, గురువిగారి వాసు, ఉప్పుశెట్టి సుధీర్, గంగాధర్, గుండు సురేష్, జయ చంద్రారెడ్డి, అరుణ్, సుబ్బనరసయ్య పాల్గొన్నారు.

టిడిపి మీడియా కో-ఆర్డినేటర్‌గా శ్రీపతి


ప్రజాశక్తి - నిమ్మనపల్లి


శ్రీపతి

రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మీడియా కో-ఆర్డినేటర్‌గా నిమ్మనపల్లి మండలం ఉప్పరపల్లెకు చెందిన ఎం.శ్రీపతిని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం నియామక జాబితాను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎం.శ్రీపతి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జిల్లా, పార్లమెంటు కమిటీలను పార్టీ పెద్దలు నియమిం చారన్నారు. టిడిపి పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీలో తగిన గుర్తింపు తప్పకుండా దక్కుతుందని ఆయన అన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ అధిష్టానానికి, ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. సమాజంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న సుపరి పాలనను, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను మీడియా సహకారంతో ప్రజల్లోకి బలంగా తీసుకుపోవడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మీడియాను సమన్వయపరచుకుని కూటమి ప్రభుత్వ అభివృద్ధి లక్ష్యాన్ని ప్రజలకు వివరిస్తానన్నారు. ఈ సందర్భంగా శ్రీపతికి టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా నిస్సార్

ప్రజాశక్తి-రాయచోటి


చంద్రబాబుతో నిస్సార్ (ఫైల్)

రాజంపేట పార్లమెంట్ వైఎస్ ప్రెసిడెంట్‌గా పట్టణానికి చెందిన వతన్ నిస్సార్ నియమి తులయ్యారు. కూటమి ప్రభుత్వం రాయచోటి మైనార్టీ నాయకుడు రాజంపేట పార్ల మెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వతన్ నిసార్ పార్టీకి చేసిన సేవలు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాజంపేట పార్లమెం ట్ వైస్ ప్రెసిడెంట్‌గా పదవి ఇచ్చారు. ఈ సందర్భంగా వతన్‌ని సార్ మాట్లా డుతూ తెలుగుదేశం పార్టీ కోసం బలోపే తానికి పనిచేస్తామన్నారు. తనపై నమ్మ కంతో సేవలను గుర్తించి పదవి ఇచ్చినందుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి, ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శుభ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి పదవులు ఎన్నో పొందాలని ఆకాంక్షించారు.

టిడిపి ఉపాధ్యక్షుడిగా ఓబునేని రంగయ్య

ప్రజాశక్తి-చిట్వేలి

పార్టీ కోసం కష్టపడితే ఫలితం ఇలాగే ఉంటుందని నమ్ముకున్న వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించిన టిడిపి అధినేత జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు, టిడిపి నియోజకవర్గ యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి, పార్లమెంట్ అధ్యక్షులు సుగువాసి ప్రసాద్ బాబు, సహకారం అందించి పార్టీని నమ్ముకున్న వారికి పెద్దపీట వేశారన్న కీర్తి తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని నూతనంగా ఎన్నికైన టిడిపి రాజంపేట, పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఓబినేని రంగయ్య యాదవ్ అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో రైతు కుటుంబంలో పుట్టి నాకు ఇంతటి ఘనత రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఈ పదవి రావడం నాకు పార్టీ బలోపేతానికి మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. అహర్నిశలు పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు


మదనపల్లె : క్రిస్మస్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

మదనపల్లె పట్టణంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మదనపల్లె ప్రధాన చర్చి అయిన సిఎస్ఐ జెసిఎం చర్చిని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ పర్వదినం ఉట్టిపడేలా డెకరేషన్లు చేశారు. విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా ఆలయాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8:30 గంటలకు క్రిస్మస్ ప్రత్యేక ఆరాధనతో చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఆనందరావు ప్రార్థనను ప్రారంభించారు. ఈ సందర్భంగా డేవిడ్ సంజయ్ కొయర్ బృందం ఆలపించిన ప్రత్యేక క్రిస్మస్ గీతాలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. లోక రక్షకుడు ఏసుక్రీస్తు అని, ఈ లోకాన్ని రక్షించడానికి, ప్రేమ, సంతోషం, సమాధానం, స్నేహం, సౌభ్రాతృత్వం, దయ, కరుణ వంటి సుగుణాలను పంచడానికి ఏసుక్రీస్తు మానవావతారంలో ఈ లోకంలో జన్మించాడని పాస్టర్ ఆనందరావు తన ప్రసంగంలో తెలిపారు. ఈ క్రిస్మస్ పర్వదినాన ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన బాటలో పయనించి అందరి క్షేమం కోసం ప్రార్థనలు చేయాలని, కార్యక్రమంలో ఆలయ సెక్రెటరీ ఆనందరావు, ట్రెజరర్ భక్తవత్సలం, కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు. మదనపల్లె పట్టణంలోని పలు ప్రార్థన మందిరాల్లో రూరల్ మండల పరిధిలోని ప్రధాన చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. పలు చర్చలను ఎమ్మెల్యే, కూటమి నాయకులు సందర్శించి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. **రాయచోటి అర్బన్ :** ప్రేమ శాంతి సంతోషాలకు చిహ్నం క్రిస్మస్ పర్వదినమని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని బేతల్ కాలనీలో మిస్పా చర్చిలో క్రిస్మస్ పర్వ దినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనా వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ ప్రేమ, శాంతి, సంతోషాలకు ప్రతీక అని అన్నారు. క్రీస్తు జననం మానవాళికి శుభకరమని పేర్కొన్నారు. క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, ఆయన కరుణా కటాక్షాలు ప్రజలందరికీ లభించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రార్థనలకు హాజరైన వారికి క్రిస్మస్ శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సాల్మన్ రెడ్డి, పాల్‌రెడ్డి, జయ చంద్రారెడ్డి, షబ్బీర్, నవరంగ్ నిస్సార్ **వీరబల్లి :** మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని ఆమూరి వాండ్లపల్లి, వీరబల్లి, పెద్దమాదిగపల్లి, మండల వ్యాప్తంగా అన్ని చర్చలను ముస్తాబు చేశారు. రంగురంగుల దీపాలతో అలంకరించారు. వందలాదిమంది క్రైస్తవ సోదరులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. చిన్న రెడ్డప్పరెడ్డి కుటుంబం ఇచ్చిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాష్ట్ర ఎంపిపిల సంఘం ఉపాధ్యక్షుడు రాజేంద్రనాథ్‌రెడ్డి పాల్గొని అన్నం వడ్డించారు. కార్యక్రమంలో రాష్ట్ర మని రాజు, చిన్న రెడ్డప్ప రెడ్డి, సురేంద్ర రెడ్డి, ఆర్యమ్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. **సుండుపల్లె :** మండలంలోని బేతానీయ చర్చిలో క్రిస్మస్ పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని అన్ని చర్చిలలో ప్రజలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **నిమ్మనపల్లి :** మండలంలో క్రిస్మస్ వేడుకలను దళిత సంఘాల నాయకులు, ఫాస్టర్లు చర్చిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం క్రైస్తవ సోదరులు ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని క్రిస్మస్ పండుగను వెంకోజీగారిపల్లి, నిమ్మనపల్లి, గుండ్లబురుజు, రాచవేటివారిపల్లి, రెడ్డివారిపల్లి, బండ్లపై, ముష్టూరు, అగ్రహారం, సామకోటవారిపల్లి, వెంగంవారిపల్లి, ఎగువ మాచిరెడ్డిగారి పల్లి, దిగువ మాచిరెడ్డిగారిపల్లి తదితర ప్రాంతాల్లో ఏసుక్రీస్తు నామాన్ని స్మరిస్తూ క్రైస్తవులు చర్చిలలో బైబిల్‌ను చదివి ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదరులు శుభాకాంక్షలు తెలుపుకొని, మిఠాయిలు పంచుకున్నారు. ఫాస్టర్‌లు జయకుమార్, వీరణాల మాణిక్యం, బాబు బైబిల్ లోని అంశాలను ఉద్దేశించి భక్తులకు ఉపన్యాసం ఇచ్చారు. **పీలేరు:** పట్టణంలో క్రిస్మస్ సంబరాలను వేడుకగా నిర్వహించుకున్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా గురువారం పట్టణంలోని అన్ని క్రైస్తవ చర్చీలు, ప్రార్థనా మందిరాల్లో బుధవారం రాత్రి నుంచి జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చీల పాస్టర్లు, ప్రార్థన మందిరాల నిర్వాహకులు ఏసుక్రీస్తు జననం గురించి, క్రిస్మస్ పండుగ ప్రాధాన్యత గురించి భక్తులకు వివరించారు. క్రైస్తవ సోదర, సోదరీమణులు తమ పిల్లలతో సహా ఈ ప్రత్యేక ప్రార్థనలకు హాజరై పాస్టర్లు ఇచ్చిన సందేశాలను అత్యంత భక్తి శద్ధలతో విన్నారు. . పీలేరు పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న దావీదుపురం ఇమ్మానుయేలు చర్చిలో పాస్టర్ సిఐ జోసఫ్ కుమార్తె సి. హెలెన్ ప్రశాంతి, సెయింట్ జాన్స్ పాల్ లూథరన్ చర్చ్ పాస్టర్ సుందర్ రావు, ఇతర ప్రార్థన మందిరాల పాస్టర్లు, క్రైస్తవ సోదర, సోదరీమణులు, వారి పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని జీసస్ జన్మదిన వేడుకలను ఆనందంగా నిర్వహించుకున్నారు. **వాల్మీకిపురం:** ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, దయ, శాంతిని స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక సిఎస్ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చింతల పాల్గొన్నారు. ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పరస్పరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో సెక్రటరీ జోసెఫ్, క్రైస్తవులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో యేసు క్రీస్తు జన్మదినాన్ని క్రిస్టియన్ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ సంబరాలు ప్రారంభన య్యాయి గురువారం ఉదయం నుంచి రాత్రి వరకూ చర్చిలలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసారు. మండల పరిధిలో వున్న చర్చిలు, ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో దేదివ్యమానంగా అలంకరించారు. క్రిస్మస్ ప్రాముఖ్యత తెలిపేలా చర్చిల్లో చేసిన అలంకరణలు ఆకట్టుకున్నాయి. తంబళ్లపల్లెలో ఉన్న సీఎస్ఐఐ చర్చి, ప్రార్థనా మందిరాలలో పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం కేక్కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుని సంబరాలు జరుపుకున్నారు. **కలకడ:** క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని బాలయ్య గారి పల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లెలో, దేవులపల్లి పంచాయతీలో దేవలపల్లి హరిజనవాడలో, కదిరాయి చెరువు, కలకడ కొత్తపల్లి, నవాబు పేట, ముడియంవారిపల్లి, కోన పంచాయితీ గంగిరెడ్డిగారిపల్లి తదితర ప్రాంతాలలో క్రైస్తవ సోదరులు తమ పవిత్రమైన ఏసుక్రీస్తు నామాన్ని స్మరించుకుంటూ వారి ప్రార్థన ఆలయాలైన చర్చిలలో ప్రాంతంలో నిర్వహించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో మనువాదాన్ని ఓడిద్దాం

ప్రజాశక్తి-పీలేరు

మనుస్మృతి మానవాళికి మరణ శాసనమని, మనిషిని మనిషిగా చూడని మనుధర్మ శాస్త్రం మాకొద్దంటూ మాల మహానాడు నాయకులు నినాదాలు చేశారు. మాల మహానాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో గురువారం పీలేరు మాల మహానాడు కార్యాలయంలో మనుస్మృతి గ్రంధ ప్రతులకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ మాట్లాడుతూ మనుస్మృతి, అంటరానితనం, వర్ణవ్యవస్థకు వ్యతిరేకంగా 1927 డిసెంబర్ 25న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మనుస్మృతి ప్రతుల దహనం చేశారని, ఆధునిక మనువాదంలో శాశ్వతంగా ఈ దేశ ప్రజలను వుంచి, కుల కట్టుబాట్లను కట్టుదిట్టం చేశారన్నారు. ప్రస్తుత వ్యవస్థలోని అగ్రకులాలు అణగారిన కులాలను విద్యకు, సంపదకు, అధికారానికి దూరం చేస్తున్నాయన్నారు. అగ్రవర్ణాలకు మనుస్మృతి అండగా ఉందని, ఈ పరిస్థితిలో దళిత, పీడిత కులాల నాయకులు, ప్రజాస్వామిక వాదులు ఆధునిక మనువాదాన్ని, సామ్రాజ్యవాద శక్తుల్ని ఓడించడానికి బలమైన ఉద్యమ నిర్మాణానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కుల వ్యవస్థను, మనువాదాన్ని అంతం చేయకుండా పీడిత ప్రజలకు రాజ్యాధికారం సాధించుకోవడం అసాధ్యమని తెలియజేశారు. కార్యక్రమంలో


మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్, మాలమహానాడు పీలేరు మండల ప్రధాన కార్యదర్శి జెట్టి రాజశేఖర్, కార్యదర్శి మద్దెల బాల గంగాధర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తూరు చిరంజీవి, ప్రచార కార్యదర్శి తుమ్మల రవి కుమార్, సహాయ కార్యదర్శి అర్పింటి రెడప్ప పాల్గొన్నారు.

పార్టీ పదవుల్లో బిసిలకు అన్యాయం

ప్రజాశక్తి -చిట్వేలి

పార్లమెంట్ ఉపాధ్యక్షులు పదవి నియామకంపై బిసిలకు అన్యాయం జరిగిందని పలువురు బిసి నాయకులు అన్నారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బిసి నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అధికారంలో లేనప్పుడు కమిటీల దగ్గర నుండి పార్లమెంట్ స్థాయిలో వరకు చురుగ్గా పాల్గొన్నామన్నారు. కేసులు పెట్టించుకుని ఇబ్బందులు పడి పార్టీని అహర్నిశలు కష్టపడ్డామన్నారు. గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు పనిచేసిన వారిని పూర్తిగా తెలుగుదేశం పార్టీ నాయకులు విస్మరించారని తెలిపారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం స్థానిక నాయకుల నుండి జిల్లా నాయకులు వరకు పరిశీలించి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన వారిని గమనించి పార్టీపై ప్రజల్లో విశ్వాసాన్ని నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మించల బాలకృష్ణ యాదవ్, అనంతయ్య యాదవ్, గుండాలయ్య యాదవ్, శంకరయ్య యాదవ్, కృష్ణయ్య యాదవ్, రాయపు చంద్రమౌళి, బిసి సంఘ నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకపోతే జరిమానా తప్పదు : ఎస్ఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

ప్రతి ఒక్క ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, సంబంధిత రికార్డులను తమ వెంట ఉంచుకోవాలని నూతనంగా వాల్మీకిపురం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన తిప్పేస్వామి అన్నారు. గురువారం ఆయన వాల్మీకిపురం ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్ అన్నమయ్య జిల్లా సైబర్ క్రైంకు బదిలీ కాగా అక్కడ పని చేస్తున్న తిప్పేస్వామి వాల్మీకిపురంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రాత్రి గస్తీని ముమ్మరం చేసి, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవ్వరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు యూనిఫారం ధరించాలని, వాహనాల రికార్డులు, లైసెన్సు, ఇన్సూరెన్స్, పొల్యూషన్, ట్యాక్స్ తదితర వాటిని తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. అక్రమ రవాణాను అరికడుతామన్నారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. మన కోసం కాకుండా మనకు ఒక కుటుంబం ఉందని అనే ఆలోచనను గుర్తు చేసుకుంటూ వాహనాలను నడపాలన్నారు. అనంతరం స్థానిక శివాలయం సర్కిల్ వద్ద వాహనాలను తనిఖీ చేసి, రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐగా సుస్మిత బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-వీరబల్లి


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ సుస్మిత

మండల ఎస్ఐగా సి.సుస్మిత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ట్రైనింగ్ పూర్తి అయిన తర్వాత వీరబల్లి మండలానికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న నరసింహారెడ్డి బదిలీపై గాలివీడు మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నూతనంగా ఎస్ఐ బాధ్యతలు చేపట్టిన సుస్మితకు పోలీస్ స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. విఆర్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి ఎస్ఐ సుస్మితను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లె ఎస్ఐగా అనిల్ కుమార్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ అనిల్‌కుమార్

తంబళ్లపల్లె నూతన ఎస్ఐగా అనిల్ కుమార్ గురువారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఉమా మహేశ్వరరెడ్డి బదిలీపై అన్నమయ్య డీసీఆర్బీకి వెళ్లారు. అక్కడి నుంచి రామసముద్రానికి వెళ్లారు. అయన స్థానంలో అన్నమయ్య జిల్లా కేంద్రంలో పీఎస్ఐగా ఉన్న అనిల్‌కుమార్ బదిలీపై తంబళ్లపల్లెకు వచ్చారు. మండలంలో శాంతి భద్రతల నియంత్రణకు కృషి చేస్తానని నూతన ఎస్ఐ పేర్కొన్నారు.

సుగవాసి ప్రసాద్‌బాబుచే అన్నదానం

ప్రజాశక్తి- కలకడ

మండలంలోని బాటవారిపల్లె బిసి కాలనీ సమీపంలో ఉన్న పంచ ముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నదానం చేశారు. ముందుగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజల చేశారు. తిరుమల తిరుపతి కొండకు కాలి నడకతో బయలుదేరిన యాత్రికులకు ఆలయంలో అన్నదానం వితరణ చేశారు. .


అన్నం వడ్డిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు


మోహివుద్దీన్ పుట్టినరోజు వేడుకల్లో ఇక్బాల్ అహ్మద్

ఘనంగా మోహివుద్దీన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని గడి గ్రామానికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.అఫూ మోహివుద్దీన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇగ్బాల్ అహ్మద్ చేతుల మీదుగా కేక్‌కట్ చేసి గ్రామస్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఇక్బాల్ అహ్మద్ మాట్లాడుతూ కె.ఎస్.అఫూ మోహివుద్దీన్ సమాజ సేవలో, రాజకీయాల్లో, పరిపాలనలో విశిష్ట సేవలు అందించారని ప్రశంసించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు.

వెల్‌విషర్స్ గిరీష్‌కు యువ పురస్కారం

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్



మాట్లాడుతున్న రామలింగారెడ్డి

ఒంగోలులో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో మదనపల్లెకు చెందిన వెల్ విషర్స్ సభ్యుడు గిరీష్ నల్లగుట్లకు ప్రతిష్టాత్మకమైన శ్రీ జనమంచి గౌరీ శంకర్ యువ పురస్కారం లభించిందడం శుభపరిణామని స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి అన్నారు. గురువారం స్థానిక రాయలసీమ స్కూల్‌లో జరిగిన ఆత్మీయత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ అవార్డులో భాగంగా రూ.50 వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు చేతుల మీదుగా అందజేశారని ఇది ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గిరీష్ నల్లగుట్ల మాట్లాడుతూ ఈ పురస్కారం వ్యక్తిగత విజయం కాకుండా వెల్ విషర్స్ సభ్యులు, రక్తదాతల సమిష్టి కృషికి లభించిన గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ అవార్డు సాధించిన సందర్భంగా సభ్యులకు అభినందనలు తెలియజేయడానికి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించామన్నారు. ఈకార్యక్రమంలో వెల్‌విషర్స్ సభ్యులు, రక్తదాతలు పాల్గొని గిరీష్ నల్లగుట్లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కూరపర్తి సాయి చైతన్య స్రవంతి నిర్వాహకులు పద్మనాభరెడ్డి, ఎస్ఐ రమాదేవి, నానబాల కుమార్, డాక్టర్ రమణాచారితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్


ఎర్రచందనం దుంగలను చూపుతున్న అటవీ అధికారులు

30 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని వానరాచపల్లి బీటు 828లోని తాటిమానుపెంట ప్రదేశంలో రూ.11,82,620 లక్షల విలువైన 30 ఎర్రచందనం దుంగలను, రూ.4 లక్షలు విలువచేసే అశోక్ లేలాండ్ దోస్త్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయి రేంజ్ ఆఫీసర్ వై.చంద్రారెడ్డిరెడ్డి తెలిపారు. డిఎఫ్ఒఆర్ జగన్నాథ్‌సింగ్ ఆదేశాల మేరకు మదనపల్లి సబ్ డిఎఫ్ఒ ఎస్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాయవరం సెక్షన్ వనరాచపల్లి బీటులోని తాటిమానుపెంట ప్రదేశంలో ఎర్రచందనం అక్రమరవాణా అవుతుందని తెలిసి సంఘటనా స్థలానికి అటవీశాఖాధికారులు చేరుకున్నారు. గమనించి నిందతులు ఫారెస్ట్ సిబ్బందిని చూసి ఇద్దరు దూకి పారిపోయారు. వాహనాన్ని పరిశీలించగా అందులో 30 ఎర్రచందనం దుంగలు , వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాడిలో రాయవరం డిప్యూటీ ఆర్ఒ ఎస్. రమేష్ బాబు, సానిపాయ స్ట్రైక్ ఫోర్స్ సిబ్బంది, సానిపాయ బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

విద్యుదాఘాతంతో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన గురువారం మదనపల్లెలో చోటు చేసుకుంది. విద్యార్థిని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని జగన్ కాలనీలో నివాసముంటున్న ఆనంద, శ్రావణి దంపతుల కుమార్తె రెడ్డి ప్రసన్న (10) 4వ తరగతి చదువుతోంది. అదే వీధిలో ఉంటున్న నిర్మలమ్మ ఇంటిపై తోటి పిల్లలతో కలిసి ఆడుకునేందుకు వెళ్లింది. ఆ సమయంలో మిద్దె పై వేలాడుతున్న11కేవి విద్యుత్ వైర్లు రెడ్డి ప్రసన్నకు తగలడంతో విద్యుత్ ఘాతానికి గురై తీవ్రంగా గాయపడింది. తల్లిదండ్రులు వెంటనే బాలికను స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. బాలిక పరిస్థితి విషమించడంతో వెంటనే తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మదనపల్లె మండలంలో వరుస విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ ఉన్నతాధికారులు మీనమేశాలను లెక్కిస్తున్నారని పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఒంటరి తనం ఆపై అనారోగ్యం భరించలేక వ్యక్తి బలవన్మరణం పొందాడు. ఈ సంఘటన గురువారం మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. కోళ్లబైలు గ్రామం, జగన్ కాలనీలో నివాసముంటున్న రామస్వామి కుమారుడు హరినాథ్(30) కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం పలువురు వద్ద అప్పులు చేశాడు. పలు ఆస్పత్రిలలో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీనికి తోడు అండగా ఉండాల్సిన భార్య వదిలి పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో తీవ్రమనస్థాపానికి గురైన హరినాథ్ జీవితం పై విరక్తి చెంది ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని ఎపి మోడల్ స్కూల్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధమ్మ (45) అనే మహిళ మృతి చెందింది. వివరాల్లోకెళితే.. టి.కమ్మపల్లి పంచాయతీ బలిజిపల్లె గ్రామానికి చెందిన సిద్ధమ్మ తన వ్యక్తిగత పనుల మీద తన కొడుకుతో కలిసి ద్విచక్ర వాహనంపై రాజంపేటకు వెళ్లారు. పనులు ముగించుకొని తన స్వగ్రామైన టి.బలిజి పల్లెకు వస్తుండగా ఎపి మోడల్ స్కూల్ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో సిద్ధమ్మ కింద పడిపోగా తలకు బలమైన తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం సిద్ధమ్మ మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న రెడ్డప్ప తెలియజేశారు.